క్లుప్తంగా

నేడు శ్రీవారి సేవకు అజిత్ దోవల్

తిరుమల: భారత జాతీయ రక్షణ శాఖ సలహాదారు అజిత్ దోవల్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. శనివారం రాత్రి తిరుమల చేరుకున్న ఆయనకు టీటీడీ ఉన్నతాధికారులు పద్మావతి అతిథి గృహం వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు.

26 నుంచి పెరియాళ్వార్ ఉత్సవం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : శ్రీగోవిందరాజ స్వామి ఆలయానికి అనుబంధంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి జూలై 5వ తేదీ వరకు పెరియాళ్వార్ ఉత్సవం నిర్వహించనున్నారు. చివరి రోజు ఉదయం పెరియాళ్వార్‌కు తిరుమంజనం జరిపించనున్నారు. సాయంత్రం శ్రీగోవిందరాజస్వామి వారు గరుడ వాహనంపై, పెరియాళ్వార్ గజ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగనున్నారు.

అమ్మవారి ఆలయ ఏఈఓగా రాధాకృష్ణమూర్తి



చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఏఈఓగా రాధాకృష్ణమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఇంటలిజెన్స్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఆలయం వద్ద ఏఈఓ రాధాకృష్ణకు అధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపంలో బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఆలయ అధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సిరులతల్లి సేవలో సినీనటి



ఆలయం వెలుపల విద్యాబాలన్

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సినీనటి విద్యాబాలన్ శనివారం సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆమెకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలు అందించారు.

జూలై 6న బీసీ ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న నాగరాజు గౌడ్

తిరుపతి కల్చరల్ : బీసీ ఆత్మగౌరవ భరోసా సభను జూలై 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజు గౌడ్ తెలిపారు. శనివారం పెద్దకాపు వీధిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆయన మాట్లాడారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం, నగరంలోని ఇందిరా మైదానంలో మధ్యాహ్నం 3 గంటలకు సభ ఉంటుందన్నారు. ఈ నెల 25వ తేదీన సభ ప్రచార రథాలను ప్రారంభించనున్నట్లు వివరించారు. సమావేశంలో నేతలు ఆవుల పాటి బుజ్జిబాబు, జగదీష్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



పుస్తకాలు అందిస్తున్న దాత తదితరులు

పాకాల : మండలంలోని సుమారు 1000 మంది విద్యార్థులకు శనివారం చిన్నగోర్పాడుకు చెందిన సుధీర్ విద్యా సామగ్రిని వితరణ చేశారు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్న సుధీర్ సుమారు రూ.80వేల విలువైన పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బాక్స్‌లు, ప్యాడ్లు, రబ్బర్లు తదితరాలను అందించారు. దాత మాట్లాడుతూ ప్రస్తుతం 1 నుంచి 5వ తరగతి పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేశామన్నారు. త్వరలో 10వ తరగతి విద్యార్థులకు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓలు బాబ్జీ, లింగయ్య పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీహరి విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువనే స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. ఉత్సవ మూర్తులకు కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం దేవదేవేరులను తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు.

యోగానందం



చంద్రగిరిలో..



ఎన్‌సీసీ క్యాడెట్లు..



టీటీడీ ఆధ్వర్యంలో..



శ్రీరామలో..

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో యోగాసనాలు వేశారు. అతిథులు మాట్లాడుతూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. దీంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. మానసిక ఒత్తిడిని జయించవచ్చని సూచించారు. – తిరుపతి సిటీ/ తిరుపతి ఎడ్యుకేషన్/ అన్నమయ్య సర్కిల్/ తిరుపతి కల్చరల్/ చంద్రగిరి/ పాకాల

నోటీస్ బోర్డు

- పెద్దకాపు వీధిలోని యూటీఎఫ్ భవన్‌లో ఉదయం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జన విజ్ఞాన వేదిక ప్రాంతీయ శిక్షణ తరగతులు.
- మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ చంద్రగిరి వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో ఉదయం 8.30 గంటలకు చంద్రగిరి క్లాక్ టవర్ వద్ద నిరసన దీక్ష.
- శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌లో తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్ల పంపిణీ.

ఆకలి కేకల రికార్డు

- యోగాంధ్ర పేరుతో ప్రజలకు నరకం
- గిరిజన బిడ్డల పరిస్థితి దారుణం
- మోదీ మెప్పు కోసమే జీవితాలతో బాబు చెలగాటం
- గిన్నిస్ రికార్డు కోసం పిల్లలను ఇబ్బందిపెట్టిన ప్రభుత్వం
- సర్కారు తీరుపై మండిపడిన విద్యార్థిలోకం



ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ తన నైజం చూపించారు. గొప్పల కోసం ప్రజలను ఇబ్బంది పెట్టారు. ప్రధానమంత్రి మోదీ మెప్పు కోసం గిరిజన బిడ్డలను సైతం అవస్థలకు గురి చేశారు. గిన్నిస్ రికార్డు కోసం జనం ఆకలి కేకలు పెట్టించారు. శనివారం ఉదయం విశాఖపట్నంలో నిర్వహించిన యోగాంధ్రను విజయవంతం చేసేందుకు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడేశారు. వైజాగ్ చుట్టు పక్కల జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో పిల్లలను బస్సుల్లో తరలించారు. కనీస వసతులు కల్పించకుండా.. అన్నపానీయాలు సైతం పంపిణీ చేయకుండా అలమటించే దుస్థితిని తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వ కర్కశ వైఖరిపై విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. రికార్డుల కోసం అమాయక గిరిజన బిడ్డలకు నరకం చూపిస్తారా అంటూ నిలదీస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించే ప్రసక్తే లేదని హెచ్చరిస్తున్నారు. – తిరుపతి సిటీ

పశువులను తోలినట్టు..



విశాఖలో ఏర్పాటు చేసి యోగాంధ్ర కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గిరిజన విద్యార్థులు పశువులను తోలినట్టు బస్సులలో కుక్కి తరలించారు. చంద్రబాబు ఆర్భాటం కోసం పసి పిల్లల ప్రాణాలతో ఆడుకున్నారు. రాత్రి సమయంలో విద్యార్థులకు నిద్రించడానికి సరైన సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదు. ఇదే రీతిలో ఎమ్మెల్యే పిల్లలను తరలిస్తారా. – బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి

దారుణం



మోదీ మెప్పుకోసమే యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి లేదు. దళిత, గిరిజన విద్యార్థులను ఈ విధంగా ఇబ్బంది పెట్టడం దారుణం. విద్యార్థులకు వసతి గృహాలలో నాణ్యమైన ఆహారం అందించలేరు కానీ, యోగాంధ్ర అంటూ డ్రామాలు మాత్రం చేపడతారు.

– శివశంకర్ నాయక్, జీఎస్ఎన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

క్షమాపణ చెప్పాలి



గిరిజన ప్రాంతాల నుంచి 25వేల మంది విద్యార్థులను తరలించారు. గిన్నిస్ రికార్డు కోసం 108 సూర్య నమస్కారాలు చేయించారు. ఆహారం, తాగునీరు, మరుగుదొడ్లు, వసతి సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం రాత్రి ఆకలితో అలమటించిన చిన్నారులు హాహాకారాలు చేశారు. దీనిపై పిల్లల తల్లిదండ్రులకు చంద్రబాబు, లోకేష్ క్షమాపణ చెప్పాలి. – ఆర్.ఆషా, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

జీవితాలతో ఆటలా..



విద్యార్థుల ప్రాణాలకు ముప్పువాటిల్లే విధంగా ప్రభుత్వం యోగాంధ్ర కోసం సుదూర ప్రాంతాల నుంచి పిల్లలను తరలించడం సిగ్గుచేటు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడడం దారుణం. పిల్లల భవిష్యత్ కోసం ఆలోచించకుండా మోదీ మెప్పు కోసం విద్యార్థుల ప్రాణాలను పణంగా పెట్టారు. – భగత్ రవి, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి

చర్యలు తీసుకోవాలి



యోగాంధ్ర అంటూ ఆర్భాటం చేసి విద్యార్థులకు నరకం చూపించారు. వేలాది మంది విద్యార్థులను విశాఖకు తరలించారు. పిల్లల పట్ల పాశవికంగా వ్యవహరించి ప్రాణాలతో చెలగాటమాడిన అధికారులు, ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి.

– ఎం.యశ్వంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, ఆర్‌సీపురం

వేతన బకాయిల కోసం ఆందోళన



ధర్నాకు దిగిన కార్మికులు, నేతలు

తిరుపతి తుడా : రుయా, మెడికల్ కాలేజీ, మెటర్నిటీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 3 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు మెటర్నిటీ ఆస్పత్రి వద్ద కార్మికులతో కలసి ఆందోళనకు దిగారు. ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఏవన్ కాంట్రాక్టర్ 3 నెలలుగా జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఆరోపించారు. అలాగే మూడేళ్లగా పీఎఫ్ నగదును కూడా కార్మికుల ఖాతాల్లో జమ చేయకుండా దుర్వినియోగం చేస్తున్నాడని మండిపడ్డారు. దీనిపై పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు ఎన్‌డీ రవి, మహేంద్ర, కేవై రాజా పాల్గొన్నారు.

గుజిరీ వ్యాపారుల సంఘానికి నూతన కమిటీ

తిరుపతి కల్చరల్ : గుజిరీ వ్యాపారుల సంఘం జిల్లా కమిటీని శనివారం ఎంపిక చేశారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడుగా కె.రాధాకృష్ణ, అధ్యక్షుడిగా దాము, ప్రధాన కార్యదర్శిగా అల్లాబక్షు, ఉపాధ్యక్షులుగా పెరుమాళ్, రహంతుల్లా, రాధాలత, సహాయ కార్యదర్శులుగా రాము, అజీమ్, శుభహాన, కోశాధికారిగా శ్రీరాములు, 9 మంది కార్యదర్శి వర్గ, 10 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎంపికయ్యారు.



దాము



అల్లా బక్షు



రాధాకృష్ణ

విలీన ప్రక్రియను అడ్డుకుంటాం

తిరుపతి సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్సిటీల కో–కన్వీనర్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఎస్వీయూ ప్రకాశం భవన్ ఎదుట ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వ వైఖరి కారణంగా పేద విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. విలీన నిర్ణయం ఉపసంహరించుకోకుంటే పోరాటం తప్పదని స్పష్టం చేశారు. అలాగే నిరుద్యోగులకు భృతి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు నరసన్న, వినోద్, తిరుమలేష్, భాను, శ్రీకాంత్, ఆకాష్, భాస్కర్, మాతేశ్వరి పాల్గొన్నారు




జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

అలంకారప్రాయం



తిరుపతి అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది. అందులో భాగంగా స్మార్ట్‌సిటీ కింద నగరంలోని పలు ప్రాంతాల్లో సెంటర్ లైట్లు ఏర్పాటు చేసింది. దీంతో తిరునగర రాత్రివేళల్లో శోభాయమానంగా వెలిగిపోయింది. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీటీడీ నిధులతో రేణిగుంట నుంచి కరకంబాడి.. మంగళం మీదుగా తిరుపతికి సెంటర్ లైట్లు అమర్చింది. అయితే గత ఆరునెలల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చినప్పుడు ఒక్కసారి మాత్రమే ఈ లైట్లు వెలుగులు పంచడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రిళ్లు అంధకారంలో ఉంటే ఈ మార్గం ఇకపై కాంతులీనుతుందనుకుంటే నిరాశే మిగిలిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. – తిరుపతి మంగళం

ట్రాఫిక్ వలయం



తిరుచానూరు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటోంది. తిరుపతి నుంచి వచ్చే మార్గం వాహనాలతో నిత్యం కిక్కిరిసిపోతోంది. శనివారం సాయంత్రం ఈ క్రమంలోనే తిరుచానూరు నుంచి శిల్పారామం వరకు ట్రాఫిక్ స్తంభించింది. వాహనాల నియంత్రణపై పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రధానంగా సింధూ సర్కిల్ నుంచి హైవే వైపుగా వెళ్లే వాటిని క్రమబద్ధీకరించాలనే డిమాండ్ స్థానికంగా వ్యక్తమవుతోంది.

– చంద్రగిరి

నింద వేసి జైలుపాలు

- నీ పరమ భక్తుడు చెవిరెడ్డిని కాపాడు స్వామీ
- సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించు తండ్రీ
- శ్రీవారికి మొరపెట్టుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు



అలిపిరి పాదాల మండపం వద్ద వైఎస్సార్ సీపీ నేతల మొక్కులు

"మద్యం మాటే నచ్చని చెవిరెడ్డిని లిక్కర్ స్కామ్‌లో ఇరికించారు. ప్రజా సేవే పరమావధిగా భావించే నాయకుడిని అక్రమంగా అరెస్ట్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతుంటే మానవత్వం లేకుండా అర్ధరాత్రి వందల కిలోమీటర్లు తిప్పారు. దేవదేవా.. నీ పరమభక్తుడు చెవిరెడ్డిని కాపాడు స్వామీ.. సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించు తండ్రీ''.. అంటూ తిరుమల శ్రీవారికి వైఎస్సార్‌సీపీ నేతలు మొరపెట్టుకున్నారు. శనివారం అలిపిరి పాదాల మండపం వద్ద వైకుంఠనాథుని ప్రార్థించారు. కక్షగట్టిన కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరారు. అన్యాయంగా బనాయించిన కేసు నుంచి చెవిరెడ్డికి విముక్తి కల్పించాలని మొక్కుకున్నారు. అకారణంగా నిందలు వేసి జైలుపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి మనిషిని దుర్మార్గంగా వేధిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని విన్నవించారు. ఈ మేరకు 516 కొబ్బరి కాయలను కొట్టి గోవిందునికి సమర్పించారు.

– తిరుపతి రూరల్

రాక్షసత్వం ప్రదర్శిస్తోంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షంపై రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తోంది. ప్రజల పక్షాన పోరాడుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు ఆయన చుట్టు కీలకంగా పనిచేస్తూ పార్టీ వ్యవహారాలను చూసుకునే వారిని టార్గెట్ చేసింది. అందులో భాగంగానే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేయించింది. చెవిరెడ్డిని తిరుమల శ్రీవారే కాపాడుకుంటారు.

– మల్లం రవి, వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు

తప్పు చేయడం తెలియదు



అనునిత్యం భక్తితో శ్రీవారిని పూజించే చెవిరెడ్డికి తప్పు చేయడం తెలియదు. కల్యాణ వెంకన్నకు ఆలయం నిర్మించి నిత్యం పూజలు చేయించే గొప్ప భక్తుడు. శ్రీవారి వైభవాన్ని చాటిచెప్పడంలో తనవంతు బాధ్యత నిర్వర్తిస్తుంటారు. అలాంటి వ్యక్తి తప్పుడు మార్గంలో వెళ్లారంటే ఎవరూరు నమ్మరు. ముమ్మాటికీ చెవిరెడ్డి అరెస్టు అక్రమం, అన్యాయం, దుర్మార్గం.

– దామినేటి కేశవులు, సర్పంచ్, పేరూరు

అప్రజాస్వామికం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే బాగా పనిచేసి అందరికీ మంచి చేస్తారని కూటమి పార్టీలకు ప్రజలు ఓట్లు వేసి అధికారమిచ్చారు. మంచి చేయడం వదిలేసి కక్ష సాధింపులతో ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందులు పెట్టడం మంచిదికాదు. చెవిరెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామికం. సర్కారు అక్రమాలను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం. – చిన్నియాదవ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు

అరెస్టు దుర్మార్గం



ప్రజలకు నిత్యం సేవలు చేసే చెవిరెడ్డి అరెస్టు దుర్మార్గం. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చెవిరెడ్డిని జైలుకు పంపాలని కుట్రలు పన్నారు. ఏడాదిగా వ్యూహాలు రచించి లిక్కర్ కేసులో ఆయనను ఇరికించారు. చెవిరెడ్డి నిజాయితీ ఏంటని ప్రజలతో పాటు రాజకీయ పార్టీల నేతలకు తెలుసు. సర్కారు కక్ష కట్టి ఇలా చేస్తోంది.

– చిలమంద మునికృష్ణ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి

దేవుడు క్షమించడు



నిత్యం సాయం చేస్తూ అందరికీ అండగా నిలబడే చెవిరెడ్డి నిజంగా మైనారిటీల పక్షపాతి. అలాంటి నాయకుడు మాకు దొరకడం గర్వకారణం. ఆయనను అక్రమంగా జైలులో పెట్టడం దారుణం. చంద్రగిరిలో టీడీపీ నేతలను ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా చూసుకున్న మంచి వ్యక్తి చెవిరెడ్డి. అడ్డంగా కేసులు పెడుతున్నవారిని దేవుడు క్షమించడు.

– ఎస్.మస్తాన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, చంద్రగిరి

బిడ్డల్లా చూసుకుంటారు



చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను చెవిరెడ్డి తన బిడ్డల్లా చూసుకుంటారు. ప్రతి ఒక్కరికీ మంచి చేయాలని నిరంతరం పరితపిస్తుంటారు. కొందరు నేతల అబద్ధాలను ప్రజలు నమ్మడం వల్లే మోహిత్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే చెవిరెడ్డి జనాలకు చేసిన మంచి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.

– ఎద్దుల చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఆర్‌సీ పురం

అవినీతిపరుడు కాదు



కోవిడ్ సమయంలో ఎంతో మందికి ప్రాణభిక్ష పెట్టిన చెవిరెడ్డిని కూటమి ప్రభుత్వం కక్ష కట్టి వేధిస్తోంది. జనంలో ఆయనకున్న మంచి పేరును చెడగొట్టేందుకు కుట్రలు పన్నుతోంది. జైలుపాలు చేసి ఇబ్బంది పెడుతోంది. చెవిరెడ్డి ఆవేశపరుడే కానీ అవినీతిపరుడు మాత్రం కాదు. ఆయన ఆరోగ్యం బాగుండాలని దేవదేవుడిని ప్రార్థించాం.

– విదుదల మాధవరెడ్డి, వైస్ ఎంపీపీ, తిరుపతి రూరల్